


# మేడ మెట్లు

బుచ్చిబాబు

అధికారి, ఎల్లాగో మూడు మెట్లూ యెక్కి, వరండాలోకి చేరుకున్నాడు. ఆయన తొడుక్కున్న మూసేసిన కంటి మెడకోటుకి ఏడు బొత్తాము లుంటాయి; వాటిల్లో పై రెండూ వూడదీసే టప్పటికి, ఆయన వోపికంతా అయిపోతుంది. బొత్తాములూ, కోటూ, టై, కాలర్—యివన్నీ నాగరికత తగిలించిన శృంఖలాలు; సంస్కారానికి మానవుడు చెల్లించే శుంకం. అల్లా అనేటందుకు అర్హత్వుండాలంటే, ఆ శృంఖలాలు తగుల్చుకోవాలి—లేకపోతే ఆ నిర్వచనానికి విలువ ఏమీ వుండదు. 'ఈ జగత్తంతా మాయ, ఏదో యదార్థం తగులడింది, అదేవిటో నాకు తెలిసి చావదు' —అని ఇంగ్లీషులో ఆరొందల పేజీల గ్రంథం వ్రాసినందుకు, గ్రంథకర్తకి డాక్టరేట్ బిరుదు దగిలించి, ఏ విశ్వవిద్యాలయానికో అధిపతిని చేసే వరకూ సంఘం వూరుకోదు. 'ఏమిజన్మం బేమి జీవనమూ' అని థర్డ్ క్లాస్ కంపార్టుమెంట్‌లో పాడుకుంటూ కానీకి చెయ్యిచాచే ముష్టి కుర్రాణ్ణి, దించి అవతలకి నెట్టేస్తారు, అదేం చిత్రమో! వాడికి వూడని బొత్తాములకోటు లేదు గనకా—

అనుకుంటూ అధికారి బొత్తాములన్నీ వూడదీసి, కోటువిప్పి, కర్రని మూలకి గెంటి కుర్చీలో కూలబడ్డాడు. వెంటనే ఏదో మరిచిపోయిన సంగతి జ్ఞాపకం వొచ్చింది. మూడునిముషాలాలోచించాడు. ఆ—మెట్లగదిలో బల్లమీద పత్రిక తీసుకురావడం. లోపలికి చూశాడు. బల్లమీద గడియారం కనబడుతోంది. టైము తెలీదు. చూడాలంటే, కళ్ళజోడు కోటుజేబులో వుంది. 'హసీ' అని కేకేశాడు. 'హసీ'కి చిన్న చిన్న వొస్తువులు నోట్లో కరుచుకుని పట్టుకురావడం నేర్పివుంటే ఎంత బాగుండును! 'హసీ' తోక కిందికి దించేసి, మెట్ల మీద గంతులేస్తోంది. లోపలికి చూపించి 'ఆ పేపరిల్లా తీసుకురా' అని సంజ్ఞ చేశాడు. 'హసీ' మూలనున్న కర్రని నోట్లో కరుచుకుని మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది. ఆ కర్రని తనకిచ్చినా బాగుం

డును; దాని సహాయంతో లోపలికెళ్ళి పత్రిక తీసుకొచ్చి, చదువుకుంటూ కూర్చుండును. నిజంగా జీవితంలో సంతోషం కలగచేసేవి ఇట్లాంటి స్వల్ప విషయాలే. రోజూ ఎనిమిదింటికి హాజరయ్యే 'తంబి'గాడు, యివాళ పదిగంటలైనా రాలేదు. అధికారి పూరికే తన ముందుపరుచుకున్న నేలనీ, దానిమీద వొరిగిన ఆకాశాన్నీచూస్తూ కూర్చున్నాడు. దేన్ని చూడడం? అర్థం పర్థంలేని కొండలు, బయళ్లు, పూరికే మేఘాలని పోగుచేసుగుని, వొక్కవర్షం చుక్కైనా కర్చుపెట్టలేని పీనాసి ఆకాశం—డాక్టర్లు, కవులు చంపుతుంటే యిక్కడికొచ్చాడు—ఆరోగ్యానికీ, అందానికీని. తనకి ఆరోగ్యం, భార్యకి అందం.

అరవైయేళ్లు దాటింతర్వాత, ఆరోగ్యం సంగతి జ్ఞాపకం వొస్తుంది యీ డాక్టర్లకి; ఏభైయేళ్లు దాటినా, తన భార్యకి తన అందంతోతప్ప, ప్రకృతి అందంతో ప్రమేయంలేదు. మేడ మెట్లు దిగి కిందికి రాదుగా! తనుపైకి ఎక్కలేడు!

"మా ఆవిడకి అందంతో నిమిత్తంలేక మెట్లు దిగదు; ఆరోగ్యంలేక నేను మెట్లెక్కలేను. ఇల్లాంటి చోటుకి పంపించారయ్యా!" అని సలహాయిచ్చిన డాక్టర్లకి వుత్తరం వ్రాద్దామని సంకల్పించుకున్నాడు అధికారి. కానైతే కాగితాలేవి,కలమేది? అవి దొరికేటప్పటికి వ్రాద్దామనుకున్నది కాస్తా మర్చిపోతాడు. అక్కడికీ తను మెట్లున్న కొంప లొద్దుమనకి, ఎక్కీ దిగా చెయ్యలేం, ముసిలాళ్ళం—అని భార్యతో ఎంత చెప్పినా ఆవిడ వింటేగా! తనకి మేడే కావాలంది. మేడలేకపోతే దర్జాకి లోపమనేమో! ఏదో రెండు రోజులోపిగపడితే, పెద్దమ్మాయి 'కల్యాణి' పూనానుంచి సెలవల కొస్తుంది. తన కష్టాలన్నీ తీరతాయి—అనుకుని, అధికారి తమాయించుకున్నాడు. తన పేరుకి తనకే నవ్వొచ్చింది. అధికారిట! కాలేజీ ప్రొఫెసర్‌గా ఆరేళ్లు అమాయకులైన విద్యార్థులమీద అధికారం ఛలాయించాడు. పత్రికా సంపాదకుడుగా ప్రూఫ్ రీడర్లమీద పదేళ్లు ఛలాయించాడు. దివాన్‌గా ఎనిమిదేళ్లు అడ్డమైన వాళ్ళమీద చలాయించాడు. ఇక్కడ, యిప్పుడు ఎవరిమీద ఛలాయించడం! కొండలు, వర్షం కురవడమేనా చేతకాని దద్దమ్మ మేఘాలు, గడ్డిమొలిస్తే ఎవరేనా కోస్తారని, రాళ్ళ గుట్టల్నికన్న బయళ్లు—వీటిమీద ఛలాయించాలి. ప్రొద్దున్న తను షికారెళ్లినప్పుడు, వో ముసిలి దౌర్భాగ్యుడు, దార్లో కలుసుగుని, ఆ కొండల్నీ, బయళ్లనీ, మేఘాలనీ మెచ్చుకోడం మొదలెట్టాడు! బాగావాదించి, కసితీరా తర్కించి అంతా తప్పని ఋజువుచేసి, ఆ దౌర్భాగ్యుణ్ణి తన భార్యముందు వోడిస్తేకాని, తనకి శాంతి సమకూరేటట్టులేదు. ప్రతి వాజా పత్రికల్లో దేశంలో శాంతి, అంతర్జాతీయ రంగంలో శాంతి అని అఘోరిస్తాడేగాని, తన హృదయంలో శాంతిని గురించి చెప్పుకోడేం! సంపాదకుడికి వొలేఖ వ్రాయాలి: "అయ్యా, ఆరోగ్యంకోసం కొండల్లో కెళ్లమనే డాక్టర్లనీ, అందంకోసం ఏకాంతంలో కెళ్లమనే కవులనీ, ప్రభుత్వంవారు బంధించి, జైళ్లలో వుంచటం అవసరంగా తోస్తోంది"—ఏం లాభం! కాగితం, కలం లేవుగా! ఇందాకా ఏదో యిట్లాంటి వుత్తరం వొకటి రాద్దామనుకున్నాడు. అదేమిటో, వొక్కటీ జ్ఞాపకంరాదు. అధికారికి తీవ్రంగా కోపం వొచ్చేసింది.

చప్పట్లుకొట్టి భార్యని కేకేశాడు.

ఆవిడ మెట్లపైన నుంచుంది.

"కిందికి దిగు," అని గర్జించాడుఅధికారి.

"ఏం ఎందుకు?"

"నా కనేకం కావాలి."

"మీరే రండి పైకి" అంది నవ్వుతూ.

"నే నొచ్చేప్పడికి, అవన్నీ మర్చిపోతాను. యీ మెట్లకొంప వొద్దంటే విన్నావుకా—"

"ఎందుకంత రుసరుస, తల్చుకుంటే మీరే ఎక్కగల్రు మెట్లు" అంది మళ్లా నవ్వుతూ. ఆ నవ్వుతో అధికారి కోపం తగ్గింది. ఆ నవ్వులో ఏముందో మజా! ఆయన కళ్లకి ఆవిడ కొండ మీద ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహంలా వుంది.

"అంతేకాని నువ్వు దిగవన్నమాట!"

"మెట్లెక్కడం, దిగడం వొంటికి మంచిదని డాక్టర్లన్నేదు!—"

"అంటాడంటాడు. వాణ్ణి మెట్లపైనుంచి, కిందికి దొర్లించి, కిందినుంచి పైకిలాగి, మళ్లా కిందికి దొర్లిస్తే,—దేశంలో అన్నం కరువేనా తగ్గుతుంది. డాక్టరు, నూటతొంభై పౌన్లు."

ఇంతట్లో 'తంబి' వొచ్చాడు. వాడిచేత గ్లాసుడు పాలు, పొగాకుడబ్బా కిందికి పంపించింది.

అధికారి పాలుత్రాగి చుట్టకాలుస్తూ, పత్రిక చదవడం సంగతి మరిచిపొయ్యాడు. ఆయన ఆలోచనలు 'దౌర్భాగ్యుడి' వేపుకి వెళ్ళ సాగాయి. తను షికారుకి వెడుతుంటే, అతను రాయిమీద పడుకుని పాడుకుంటూ కనబడ్డాడు; తనలాగే అతను ముసలి; ఎటొచ్చీ అతని నెరిసిన తలవెంట్రుకలు వూడలేదు. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో దేవకళా ప్రత్యక్షమయ్యాడు, ఇద్దరూ అరగంట సేపు కబుర్లు చెప్పుకున్నారు; సంభాషణ, మొదట్లో గాడిదల్ని గురించి ప్రారంభమైంది.—ఎందుకో దూరంగా పొలాల్లో వారికో గాడిద కనిపించింది. ఆ ముసలాయన ఆ కొండల్ని, బయళ్ళని మెచ్చుగోలం మొదలెట్టాడు. తనకి వొళ్లు మండిపోయింది; వాదించుకున్నారు యిద్దరూ. 'ఇంతటితో వాదం పూర్తికాలేదు, యింటికి రా,' అని ఆహ్వానించాడు. తను వొచ్చేస్తూ, నీ పేరేమిటనడిగితే 'దౌర్భాగ్యుడు' అన్నాడు. నిజంగా అన్నాడా, తన భ్రమా? అధికారి కళ్లు నీరసంగా మూతలు పడ్డాయి. గాలికి కొట్టుకు కొట్టుకుని అలిసి వేలాడి పోయిన వొంటి ఆకులా అతని మెడ బుజం మీద నిశ్చితంగా వాలిపోయింది.

ఎంత సేపయిందో...

ఎవరో అతన్ని లేపారు...తంబిగాడు.

వాడి బుజంమ్మీద చేతులు ఆనించి అధికారి మెట్లెక్కడం సాగించాడు. మెట్లమీద ఏదో మనిషి ఆకృతి,—మరీ మరీ పెద్దదవుతోంది—నాలుగు, ఐదు, ఆరు—ఎవరిది ఆ ఆకృతి—ఏడు ఎనిమిది—తన భార్య అరుణ!—తొమ్మిది—తెల్ల మబ్బుల్ని కప్పుకున్న పచ్చకొండలా ఆ వక్షం, నురగల్ని పెనవేసుగు కెరటంలా ఆ తెల్లటి జుట్టు: చీకట్లో చలించని నీటిలో మసలిన చంద్ర బింబాల జంటలా ఆ కళ్లజోడు—పన్నెండు, పదమూడు—మెట్లెక్కడం ఎంత సులభం! —పదిహేను—పదహారు—మెట్ల భవనాలపై తిరిగి, హాసంతో ముడుచుకున్న ఆమె పెదవులు, సముద్రంలో కలిసిపొయ్యే సంధ్యా సమయ మేఘాలలో తన దృష్టిని ఆపరిస్తోంది—పంతొమ్మిది—అది నవ్వా! పైపళ్లు రెండు, వూడి పొయ్యాయి. పాపం! బంగారంపళ్లు వేయిస్తానంటే వొద్దంది—పెదవులతో నవ్వడం వొక్క అరుణకే తెలుసు—ఇరవై, అమ్మయ్య—ఇరవై వొకటి, చేతులతో అందుకుంది-అధికారి అరుణలో ఐక్యం అయిపొయ్యాడు.

× × ×

ఆ రోజున ఎవ్వరూ మళ్లా మేడమెట్లు దిగలేదు. 'దౌర్భాగ్యుడు' రాలేదు.

× × ×

మొన్నాడు తెల్లారి, ఎనిమిదింటికి, అధికారికి అమాంతంగా 'దౌర్భాగ్యుడి' సంగతి జ్ఞాపకం వొచ్చింది. వెళ్లివెదికి తీసుకురావాలని బైలుదేరాడు. పైగా డాక్టర్లు రోజూ ఉదయం వాకైలేనా నడవాలన్నారు.—డాక్టర్లజోలి తనకెందుకు? ఈ కసరత్తు స్త్రీలకి చెప్పరేమో డాక్టర్లు: ఎవళ్లు ఏది చెయ్యగలిగితే దాన్నే వురమాయిస్తారు కాబోలు. ఇంతమంది డాక్టర్లుండీగూడా యీ దేశంలో జనాభా పెరిగిపోవడం నిజంగా ఆశ్చర్యమే!

"నువ్వు నన్ను దింప నక్కర్లేదు, నేనే దిగుతాను,"—అంటూ అరుణ చేతిని తొలిగించేసి, వొంటిగా మెట్లు దిగడం మొదలెట్టాడు అధికారి. ఒక్క మెట్టు దిగేసరికి, మెట్లగది గుమ్మంలో దౌర్భాగ్యుడి మొహం కనిపించింది. దౌర్భాగ్యుడు రాతిబొమ్మలా స్తంభించి మెట్లకేసి చూస్తున్నాడు.

"అదేవిటి మాటా మంతీ ఆడవేం—నేను దిగలేననా—?" అధికారి ఆఖరి మెట్టుమీద అడుగు పెట్టగానే, అరుణలోపలి కెళ్లిపోయింది.

"అదేవిటి, తెల్లబోయి చూస్తావు, ఎప్పుడూ మేడమెట్లు చూళ్లేదా!" ఆయాసంతో అధికారి చివరి మెట్టుమీద కూర్చుండిపొయ్యాడు. దౌర్భాగ్యుడుకూడా ఆయన ప్రక్కనే కూర్చున్నాడు.

"ఇదిగో చూడు—"

"చూస్తున్నా, వింటున్నా—"

"నీతో ఏదోచెప్పాలనుకున్నా—నీకేమన్నా జ్ఞాపకంవుందా?"

'ఓ, మీరు గట్టిగామాట్లాడనక్కర్లేదు. నాకు చెముడులేదు."

"ఆ విషయంగాదు. ఆ జ్ఞాపకంవొచ్చింది—యీ కోటు విప్పాలి. మనం యింక బైటకె వెళ్లంగా."

అని, కాసేపు కోటువిప్పే కార్యక్రమం జరిపాడు అధికారి.

"ఇప్పుడు చెప్పు, నేనేం మరిచిపొయ్యానో."

"కొండరు—" అని నవ్వాడు దౌర్భాగ్యుడు సక్రమంగావున్న పళ్ల-వరసని బైటపెడుతూ.

"నువ్వసాధ్యుడవే— నేనంటాను— యిప్పుడు మరి చెప్పొయ్యాను. కాసేపుండి చెబుతాలే— అన్నట్టు నువ్వేమన్నా టిఫిను ఫలహారం చేస్తావా, చేశావా—?"

"చేశాను; ఐనా, అభ్యంతరం లేదు."

"ఇదుగో, అరుణా—ఆ, నీ పేరేమిటి?"

"చెప్పాగా- దౌర్భాగ్యుడు."

"భలే సరసమే—మా యిల్లాలితో యీ దౌర్భాగ్యుడికి ఫలహారం పట్రావే అనమంటావా- ఇదుగో, అరుణా ఫలహారం తీసుకురా—"

అరుణ మెట్లమీదనుంచుంది. ఆవిడచుట్టూ, 'హాసీ' గంతులేస్తోంది. మెట్లమీదినుంచి గబగబా దిగి- వారిద్దరి మధ్యకీ వొచ్చింది. ఇంతలో 'తంబి' వొచ్చాడు. పైకిరమ్మని సంజ్ఞ చేసింది అరుణ. 'తంబి' అధికారిని లేవదీసి వరండాలోకి తీసికెళ్ళి, కుర్చీలో జేర్లవేశాడు. మరో పడకుర్చీలో దౌర్భాగ్యుడు కూర్చున్నాడు. 'తంబి' ఫలహారం తీసుకొచ్చాడు—రొట్టె, వెన్న, పంచదార, రెండు కమలాఫలాలు, కాఫీ.

"నిన్నుకూడా, నాలా, యీ వూరు డాక్టర్లు పంపలేదుకదా?" అని అడిగాడు అధికారి.

"లేదు. అంటే సాధారణంగా డాక్టర్లకి వాళ్లుంటున్న వూరువొదిలి వెళ్లే అవకాశం వుండదు, అంచేత యితరుల్ని మరోచోటుకి పంపేనా తృప్తి పడతారు—" ఈ విషయం అధికారికి నచ్చినట్లుంది; బహుసంతోషంతో 'వూ'కొడుతూ కుర్చీకొంచం ముందుకి జరుపుకున్నాడు.

"నేను దివానుగాఉంటున్నరోజుల్లో వోమారు, తాశీల్దారుకి జబ్బుచేస్తే, మదనపిల్లి పంపించారు డాక్టర్లు; ఆయన వొచ్చాక, ఆయనభార్యకి జబ్బు చేసింది; ఆవిణ్ణి పంపించారు,—తరవాత ఆయన్ని; మళ్లా తరవాత ఆవిణ్ణి— భార్యాభర్తల వియోగం వల్ల అన్ని జబ్బులూ కుదురుతాయేమో!—"అని అధికారి నవ్వడం సాగించాడు.

కాసేపు నిదానించి మళ్లా అంటున్నాడు:

"నువ్వునవ్వవేం? నీకు పెళ్లాం పిల్లలూ వున్నారా? యింతకీ తాశీల్దారు పెళ్లాన్నిచూడ్డం తటస్థించిందా; ఏజబ్బూ లేదు; దుక్కలాగుంది—" మళ్లానవ్వుతున్నాడు.

"అంటే ఆడాళ్లజబ్బులు పైకి కనబడవుగా మరి—" అన్నాడు దౌర్భాగ్యుడు.

"గోపలరోగం అంటావు—మీ ఆవిడకేం జబ్బు?"

"నాకు భార్యలేదు;"

"పోయిందా పాపం?"

"అసలు పెళ్లికాలేదు."

"పిల్లలు?—మరే, మరే—అసలు పెళ్లేకానన్నావుగా, పెళ్లికానంత మాత్రాన పిల్లలుండకూడదని లేదనుకో—" అధికారి, తనలో తానే నవ్వుకొంటున్నాడు.

"ఇదిగో నిన్ను 'దౌర్భాగ్యుడు' అని పిలవటం ఏమీ బాగాలేదు. నీ పేరేమిటో చెప్పు,చంపక."

"నాకే పేరుంటే బాగుంటుందో, ఆ పేరే పెట్టి పిలండి."

"ఐతే ఆలోచించనీ—నువ్వు కొండల్ని మహా మెచ్చుగుంటున్నావు గనక, 'కొండయ్య' అని పిలుస్తాను... లేకపోతేను," అని అధికారి వెటకారంగా కోపం ప్రకటించాడు.

"అల్లాగే పిలవండి—నాకు కొండలంటే నిజంగా యిష్టం. వాటిల్లో స్థిరత్వంవుంది; అవి కదలవు, మారిపోవు: మనుషులు మోసగిస్తారు, మోసపోతారు; మారిపోతారు, అసలుపోతారు. కొండలు మాత్రం అల్లాగే వుండిపోతాయి—"అన్నాడు 'కొండయ్య.'

"అది బాగానేవుందయ్యా, అవుతే— మేఘాలనీ, నదులనీ మెచ్చుగుంటావెందుకు?"

"అవన్నీ ఆ కొండల్ని పట్టుకుని దేవుళ్లాడతాయి గనక—"

"కొంపతీసి నువ్వుకవివా ఏమిటిచెప్పు..."

"ఇంకోళ్లకొంపలు తీశేవాడు సంస్కర్త, తన కొంప తీసుకునేవాడు కవి" అన్నాడు 'కొండయ్య' గూఢంగా.

"నీ కసలుకొంపే లేదుగా—" అని వికృతంగా నవ్వాడు అధికారి. మళ్లా యేదో జ్ఞప్తికి వొచ్చి—

"నీకు ఆ తాశీల్దారు భార్య ఫొటో చూపించాలి" అని చప్పట్లుకొట్టి 'తంబిని' కేకేసి, అమ్మగార్నడిగి సంస్థానం ఫొటోల ఆల్బమ్ తీసుకురమ్మన్నాడు.

(ఇంకావుంది)